క్లుప్తంగా

లంపి సోకకుండా టీకాలు


పశువులకు టీకాలు వేస్తున్న సిబ్బంది

నాగలాపురం: మండలంలోని గోవర్ధనగిరి పంచాయతీలో ఆవులు, గేదలు, దూడలకు లంపి చర్మ వ్యాధి సోకకుండా 198 టీకాలు వేయించామని వెటర్నరీ డాక్టర్ మంజుల తెలిపారు. ఆమె మాట్లాడుతూ లంపి చర్మ వ్యాధి సోకిన పశువుల చర్మాలపై పెద్ద పెద్ద దద్దుర్లు ఏర్పడుతాయన్నారు. ఈ వ్యాధి సోకిన పశువులు ఒకటి నుంచి రెండు శాతం పశువులకు మాత్రం మరణాలు సంభవిస్తాయన్నారు. ఇది మనుషులకు సోకదని స్పష్టం చేశారు. ఈ వ్యాధిని నిరోధించేందుకు గోట్ ఫాక్స్ వ్యాక్సిన్ వినియోగించనున్నట్లు పేర్కొన్నారు. అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్ కె.విజయ్‌కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా రొట్టెల పండుగ


దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లిం పెద్దలు

శ్రీకాళహస్తి: పట్టణంలోని హజరత్ జుంలేషా పీర్ దర్గాలో రొట్టెల పండుగ శనివారం ఘనంగా జరిగింది. భక్తులు రొట్టెలను మార్చుకుంటూ ఆరోగ్య, పెళ్లి, విద్య, ఉద్యోగ రొట్టెను ఒకరికొకరు మార్చుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. దర్గా నిర్వాహకులు సయ్యద బాబా ఫరీద్, సభ్యులు నాగేశ్వరరావు, రాజేశ్వరరావు, గరికపాటి రమేష్ బాబు, పులి రామచంద్రయ్య, జాకీర్, భాస్కర్ పాల్గొన్నారు.

టౌన్ సర్వీసు పునరుద్ధరణ


బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న నేతలు

రేణిగుంట: కాలేజ్ విద్యార్థుల సౌకర్యార్థం రేణిగుంట–చంద్రగిరి టౌన్ బస్ సర్వీసును శనివారం ఆర్టీసీ అధికారులు పునరుద్ధరించారు. ఈ మేరకు శనివారం రేణిగుంట ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో బీజేపీ నేతలు బీడీ బాలాజీ, ఆర్‌టీసీ సిబ్బంది జెండా ఊపి బస్సు సర్వీసును లాంచనంగా ప్రారంభించారు. దీంతో పద్మావతీ, ఎస్వీ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు మరో బస్సు మారకుండా ప్రయాణించే వెసులుబాటు రావడంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. బీజేపీ నేతలు తేజోవతి, ప్రేమ్‌రెడ్డి పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలించండి


మాట్లాడుతున్న రత్నమ్మ

ఏర్పేడు: బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యతని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రత్నమ్మ అన్నారు. శనివారం మేర్లపాక ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో బాల్యవివాహాలపై గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో బాల్య వివాహాలు జరగకుండా నివారించాలన్నారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్త లావణ్య, ఏర్పేడు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది సుజాత, చాందిని, లక్ష్మి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం


పుస్తకాలను అందజేస్తున్న శంకరయ్య

ఏర్పేడు: గ్రంథాలయ పుస్తకాల పఠనంతో విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని ప్రధానోపాధ్యాయుడు శంకరయ్య అన్నారు. శనివారం మండలంలోని చిందేపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రజా సాధికార ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు గ్రంథాలయ పుస్తకాల పంపిణీ జరిగింది. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే చదువుతో పాటు గ్రంథాలయ పుస్తకాలు పఠనం చేయాలన్నారు. పేద విద్యార్థుల అభ్యున్నతికి కృషిచేయాలన్నారు. ప్రజా సాధికారిక ట్రస్ట్ కో–ఆర్డినేటర్ సురేష్, గోవర్ధన్, తులసి, ఉపాధ్యాయులు గురవారెడ్డి, దేవరాజులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమ్మర్ స్టోరేజ్ ఎండమావేనా?


సమ్మర్ స్టోరేజ్‌కు గుర్తించిన దళవాయి అగ్రహారం చెరువు


నిర్మించిన ఫిల్టర్ బెడ్

సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు సత్యవేడు ప్రాంత ప్రజలకు ఎండమావిగానే మిగిలింది. ఈ ప్రాజెక్టు 15ఏళ్లుగా ప్రతిపాదనల స్థాయి దాటలేదు. 10ఏళ్ల ముందు నిధులు ఉన్నా భూసేకరణ పూర్తిస్థాయిలో చేపట్టకపోవడంతో ట్యాంకు ఏర్పాటు ప్రశ్నార్థకంగానే మిగిలింది.

- ప్రతిపాదనలకే పరిమితం
- ముందుకు సాగని ట్యాంకు పనులు

సత్యవేడు: పట్టణంతో పాటు మండలంలోని 15 పంచాయతీలకు తాగునీటి సమస్య తీర్చే సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు ఎండమావిగానే మిగిలింది. 15 ఏళ్ల మునుపు టీడీపీ ఎమ్మెల్యేగా డాక్టర్ ఎస్.శివప్రసాద్ రూ.4కోట్లు మంజూరు చేయించి, దీనికి శిలాఫలకం వేయించారు. ఈ పనుల్లో భాగంగా తెలుగుగంగ కాలువ సమీపంలో ఫిల్టర్ బెడ్, పంపింగ్ మోటార్, తెలుగుగంగ కాలువలో బోర్లు ఏర్పాటు చేశారు. గంగ కాలువలో నీటి ప్రవాహం ఉంటే సత్యవేడు ప్రజలకు నీటి సరఫరాకు ఇబ్బంది ఉండదు. నీటి ప్రవాహం ఆగితే కాలువలోని బోరుతో అన్ని గ్రామాలకు నీరు అందించడం సాధ్యం కాదు.

రెండోసారి ప్రతిపాదనలు

నాలుగేళ్ల క్రితం రూ.10 కోట్ల సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు ఫిల్టర్ బెడ్, పంపింగ్ హౌస్ నిర్మించాలని గంగ కాలువ సమీపంలో చదవాలమ్మ ఆలయానికి దగ్గర భూములు గుర్తించారు. ట్యాంకు ఏర్పాటుకు మట్టి నమూనాలు సేకరించారు. ఈ స్థలంలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు అనువుగా లేదని తేలింది.

దళవాయి అగ్రహారం చెరువు ఎంపిక..

దళవాయి అగ్రహారం చెరువును సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుగా మార్చేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. చెరువు మట్టిని సేకరించి భూ నమూనా పరీక్షకు ల్యాబ్‌కు పంపారు. సమ్మర్ స్టోరేజ్ ఏర్పాటుకు దళవాయి అగ్రహారం చెరువు భూమి అనువుగా ఉన్నట్లు తేలింది. చెరువు భూమిని అప్పగించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఇరిగేషన్ అధికారులను కోరారు. వారు అంగీకరించారు. అమేరకు అనుమతి ఇచ్చారు.

28 ఎకరాలు అవసరం..

సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు 28 ఎకరాలు అవసరం. చెరువు విస్తీర్ణం 18 ఎకరాలు మాత్రమే ఉంది. మరో పది ఎకరాలు చెరువు సమీపంలోని రైతుల నుంచి భూసేకరణ చేపట్టాలి. పట్టా భూముల సేకరణలో అధికారులు జాప్యం చేస్తుండడంతో సమ్మర్ స్టోరేజ్ పూర్తికాలేదు. సత్యవేడు ప్రాంతంలో ఎస్ఈజెడ్ ఉండడం వల్లభూములు ధరలకు రెక్కలు వచ్చాయి. దీంతో భూసేకరణ అధికారులకు తలనొప్పిగా మారింది. ప్రస్తుతం భూసేకరణకు నిధులు కేటాయింపు భారీగా పెంచాల్సిన అవసరం ఉంది. అధికారులు,ప్రజాప్రతినిధులు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు ఏర్పాటుకు చొరవ చూపాల్సిన అవసరం ఉంది.

ఎమ్మెల్యే చొరవ చూపాలి..

రెండు పర్యాయాలు సత్యవేడు ఎమ్మెల్యేగా గెలుపొందిన కోనేటి ఆదిమూలం సత్యవేడులో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు ఏర్పాటుకు చొరవ చూపాలని స్థానికులు కోరుతున్నారు. సమ్మర్ స్టోరేజ్ ఏర్పాటుకు నిధులు సమకూరుస్తారని స్థానికులు విశ్వసిస్తున్నారు.

విద్యార్థులకు సులభ రీతిలో బోధించాలి


మాట్లాడుతున్న డీఈఓ శేఖర్

శ్రీకాళహస్తి: విద్యార్థులకు సులభ రీతిలో బోధించాలని డీఈఓ శేఖర్ అన్నారు. పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ సాధన శిక్షణ కార్యక్రమాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ స్వీయ పథకంలో భాగంగా ప్రధానోపాధ్యాయులు తన పరిధిలో పరిశీలన చేయాలన్నారు. విద్యార్థులకు నైపుణ్యం, తరగతి బోధన వంటి అంశాలను శాస్త్రీయ పద్ధతిలో బోధించాలన్నారు. ఏఎంఓ శివశంకరయ్య, అసిస్టెంట్ ఏఎంఓ మధు, ఎంఈఓలు భువనేశ్వరి, బాలయ్య పాల్గొన్నారు.

నేడు భక్తులకు అన్నదానం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి క్షేత్రంలో ప్రతి పౌర్ణమికి భక్తులు గిరిప్రదక్షిణ చేస్తుంటారు. ఈ నేపథ్యంలో ఆదివారం 13వ కిలోమీటర్ ప్రాంతంలో రామాపురం మార్గంలో రేణుకా పరాశక్తి పీఠం ఆధ్వర్యంలో ఉదయం 6 నుంచి రాత్రి 8గంటల వరకు అన్నప్రసాద వితరణ జరుగుతుందని తెలిపారు. భక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిధంగా మాతాజీ ఆధ్వర్యంలో లక్ష్మీ గణపతి, రేణుకా ప్రత్యంగిరా సాముహిక మహాయజ్ఞం జరగనున్నట్లు తెలిపారు.

ఆ రెండు శాఖలే కీలకం!

- సత్యవేడు నియోజకవర్గంలో బదిలీల పోస్టింగ్‌లకు మొదలైన పైరవీలు
- పోలీస్, రెవెన్యూ శాఖల్లో మొదలైన హడావుడి



వరదయ్యపాళెం: కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక తొలిసారిగా జరుగుతున్న అధికారుల బదిలీల ప్రక్రియకు సంబంధించి సత్యవేడు నియోజకవర్గంలో పైరవీల సందడి మొదలైంది. ప్రధానంగా పోలీస్, రెవెన్యూ శాఖల్లో పోస్టింగ్‌ల కోసం వారి వారి ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఆ దిశగా పోస్టింగ్‌ల కోసం కూటమి ద్వారా ఎన్నికైన నియోజకవర్గ ప్రజాప్రతినిధి వద్దకు, సూళ్లూరుపేటకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త వద్దకు పోస్టింగ్‌ల కోసం అధికారులు క్యూకడుతున్నారు. ఆ దశగా రెవెన్యూ, పోలీస్ శాఖల్లో తమకు నచ్చిన స్థానాలను సొంతం చేసుకునేందుకు అన్ని రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఆర్థిక, రాజకీయ పలుకుబడులను సర్వశక్తులా వడ్డుతున్నారు.

పోలీస్, రెవెన్యూ శాఖలకే డిమాండ్..

సత్యవేడు నియోజకవర్గంలో ప్రధానంగా పోలీస్, రెవెన్యూ శాఖలకే అత్యధిక డిమాండ్ ఉంది. ప్రధానంగా సత్యవేడు పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నుంచి బీఎన్‌కండ్రిగ, వరదయ్యపాళెం, సత్యవేడు పోలీస్ స్టేషన్ల సబ్ ఇన్‌స్పెక్టర్‌లకు పోటీ పడుతున్నారు. ఈ నాలుగు పోస్టులకు పోలీస్ శాఖలో మంచి డిమాండ్ ఉంది. ఈ పోలీస్‌స్టేషన్ పరిధిలో కంకర క్వారీలు, గ్రావెల్ క్వారీలు ఉండడంతో ఇక్కడ పోలీసులకు నెలసరి మామూళ్లు లక్షల్లో అందుతాయి. అంతేకాక కంకర క్వారీల నుంచి తమిళనాడుకు పెద్ద సంఖ్యలో టిప్పర్ లారీలు అధిక బరువుతో రవాణా చేస్తుండడంతో వారి నుంచి ఒక్కో లారీకి నెలసరి మూమూళ్లు పెద్ద మొత్తంలో ముట్టజెబుతారు. ఈ పరిస్థితుల దృష్ట్యా సర్కిల్ ఇన్‌స్పెక్టర్, ఎస్ఐ పోస్టులకు లక్షల్లో రేటు పలుకుతోంది.

రెవెన్యూ శాఖలో అదే పరిస్థితి..

బీఎన్‌కండ్రిగ, వరదయ్యపాళెం, సత్యవేడు, కేవీబీపురం మండలాల్లో రియల్ ఎస్టేట్ పుంజుకోవడంతో భూ లావాదేవీలు పెద్దఎత్తున చేతులు మారుతున్నాయి. ఈనేపథ్యంలో ఈ నాలుగు మండలాల్లో తహసీల్దార్లుగా పోస్టింగ్‌లు వేసుకునేందుకు పెద్దఎత్తున పైరవీలు జరుగుతున్నాయి. ప్రధానంగా సత్యవేడు, వరదయ్యపాళెం మండలాల పరిధిలో అటు శ్రీసిటీ, ఇటు ఏపీఐఐసీ పరిధిలో కొన్ని పరిశ్రమలు ఉండడం, వారికి తరచూ రెవెన్యూ అవసరం ఉంటుంది. ఈ నేపథ్యంలో వారి నుంచి పెద్దఎత్తున ఆర్థిక లబ్ధి తహసీల్దార్లకు చేకూరనుంది. ఈ పరిస్థితుల్లో ఎంతైనా వెచ్చించి పోస్టింగ్‌లు వేసుకునేందుకు అధికారులు వెనకాడడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో రెండు శాఖలకు సంబంధించి పోస్టింగ్‌లు ఎవరిని వరిస్తాయో మరో వారం రోజుల్లో తేలనుంది.

సకాలంలో పచ్చిరొట్ట పంపిణీ


మాట్లాడుతున్న ప్రసాద్‌రావు

శ్రీకాళహస్తి: వర్షాలు పడుతున్న నేపథ్యంలో రైతులకు పచ్చిరొట్ట ఎరువులను సకాలంలో పంపిణీ చేయాలని జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్‌రావు అన్నారు. ఏపీసీడ్స్ కార్యాలయంలో శనివారం జిల్లా మేనేజర్ సంపత్‌తో కలిసి వ్యవసాయాధికారులతో సమీక్షించారు. పచ్చిరొట్ట ఎరువుల సరఫరాపై ఆరాతీశారు. అనంతరం తొట్టంబేడు మండల పాయ్య రైతు సేవా కేంద్రంలో కౌలుదారు గుర్తింపు కార్డులను రైతులకు అందజేశారు. వ్యవసాయాధికారులు ధనంజయరెడ్డి, రమేష్, సుధాకర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కనులపండువగా ఉత్తర గోగ్రహణం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా శ్రీకాళహస్తిలో వెలసిన ద్రౌపదీ సమేత ధర్మరాజ స్వామి ఆలయంలో శనివారం ఉత్తర గోగ్రహణం కనులపండువగా జరిగింది. మహాభారతం ఉత్సవాల్లో భాగంగా ఉత్తర గోగ్రహణం ఘట్టాని వేషధారులు ప్రదర్శించారు. ఉదయం ద్రౌపదీదేవి పురవిహారం చేశారు. రాత్రి గోవులను మళ్లించడం కార్యక్రమంలో భాగంగా అర్జునుడు అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు.

నేడు అగ్నిగుండ మహోత్సవం..

ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం అగ్నిగుండ మహోత్సవం నిర్వహించనున్నారు. సాయంత్రం 6గంటలకు అగ్నిగుండ ప్రవేశం ప్రారంభం కానుంది. ప్రతి ఏటా 5వేల మంది భక్తులు కంకణాలు ధరించి అగ్నిగుండ ప్రవేశం చేస్తారు. మహోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో రానున్నారు.


పురవీధుల్లో ఊరేగుతున్న ద్రౌపదీదేవి

దివ్యాంగులకు పరికరాల పంపిణీ


పంపిణీ చేసిన పరికరాలతో వృద్ధ దివ్యాంగులు

రేణిగుంట: మండలంలోని కరకంబాడి ఇందిరానగర్ రాస్ కార్యాలయంలో శనివారం ఏటీసీ, హెల్పేజ్ ఇండియా సహకారంతో రాస్ ఆధ్వర్యంలో వృద్ధ దివ్యాంగులకు పరికరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాస్ సంచాలకులు వి.నాగరాజు పాల్గొని వృద్ధ దివ్యాంగులు 40మందికి చేతికర్రలు, 18మందికి ట్రైపాడ్స్, ఐదుగురికి ఎల్బో క్రచ్చెస్, మరో ఐదుగురికి వాకర్ స్టాండ్స్, ఇద్దరికి వీల్ చైర్లను పంపిణీ చేశారు. హెల్పేజ్ ఇండియా ప్రాజెక్టు మేనేజర్ టి.షడ్రిక్, రాస్ బీబీవీ ప్రాజెక్టు ఆఫీసర్ రమేష్ రెడ్డి, బాలాజీ వృద్ధుల సంక్షేమ సొసైటీ సభ్యులు నాగరత్నమ్మ, సుబ్బులమ్మ, రాజేశ్వరి, రాస్ సిబ్బంది గిరి, అన్బలగన్, మంజునాథ్, స్వాతి, ఇందుమతి, జ్యోతి, నాగమణి, శంకరయ్య పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పుత్తేరి గ్రామంలోని సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. ఆయన శనివారం పుత్తేరి గ్రామంలో పర్యటించి, గ్రామస్తులతో మాట్లాడారు. ఎస్ఆర్ఐ పార్థసారథి ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఎమ్మెల్యేచే నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేసి, గ్రామంలోని పలు సమస్యలను ఏకరువు పెట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కేటీ రోడ్డు నుంచి పుత్తేరి గ్రామం వరకు ఉన్న తారురోడ్డుకు మరమ్మతులు చేయిస్తానని, గ్రామంలోని తాగునీటి సమస్య, భూసమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం రైతులకు జనుములను 50 శాతం రాయితీపై పంపిణీ చేశారు. టీడీపీ సత్యవేడు నియోజక వర్గ పరిశీలకుడు చంద్రశేఖర్‌నాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు సుధాకర్‌నాయుడు, సర్పంచ్ రామ్మూర్తి, ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు, ఎంఈఓ రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్ జూబ్లీహిల్స్‌కు చెందిన రాజేంద్రప్రసాద్‌వర్మ రూ.లక్ష శనివారం విరాళంగా అందజేశారు. విరాళాన్ని ఆలయ అధికారులు స్వీకరించి దాతకు కృతజ్ఞతలు తెలిపారు. దాతకు స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.


విరాళం అందజేస్తున్న దాత

మృతుని కుటుంబానికి న్యాయం చేయాలి

ఏర్పేడు: కర్మాగారంలో విధులు నిర్వహిస్తూ పైనుంచి కిందపడి మృతిచెందిన మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని రైతు సంఘం జిల్లా నాయకుడు రంగయ్య డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని కొత్తకండ్రిగ సమీపంలోని పుష్పిత్ ఫ్యాక్టరీ వద్ద ఆందోళన చేశారు. ఆయన మాట్లాడుతూ జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన బిక్రమ్ హాన్స్‌డా(24) ఫ్యాక్టరీలో వెల్డింగ్ చేసే కార్మికుడిగా పనిచేస్తున్నట్లు తెలిపారు. యాజమాన్యం కార్మికుడికి ఎలాంటి రక్షణ సదుపాయాలు కల్పించకపోవడంతో శుక్రవారం విధులు నిర్వహిస్తూ కాలుజారి కిందపడి తలకు బలమైన గాయమై మృతిచెందినట్లు చెప్పారు. మృతుని కుటుంబానికి ఫ్యాక్టరీ యాజమాన్యం తగిన న్యాయం చేయాలన్నారు. గతంలో ఎంతో మంది కార్మికులు కర్మాగారంలో విధులు నిర్వహిస్తూ మృతిచెందినట్లు ఆరోపించారు. ఇలాంటి ఘటనలను యాజమాన్యం గుట్టుచప్పుడుగా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. మృతుని కుటుంబానికి నష్టపరిహారంతో పాటు కుటుంబంలో ఓ వ్యక్తికి ఉద్యోగం ఇవ్వకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



పుష్పిత్ కర్మాగారం వద్ద ఆందోళన చేస్తున్న రైతు సంఘం నేతలు

లారీ డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

రేణిగుంట: మండలంలోని కరకంబాడి అమరరాజ ఫ్యాక్టరీలో శనివారం లారీ డ్రైవర్లకు రాజన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో అమరరాజ లాజిస్టిక్, తిరుపతి అరవింద్ కంటి ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. 200 మంది లారీడ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించారు. లారీడ్రైవర్లకు కంటి ఆరోగ్యం ఎంతో ప్రధానమని, తరచూ ఇలాంటి శిబిరాలను నిర్వహించి వైద్యసేవలను పేదలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆస్పత్రి యాజమాన్యాన్ని కోరారు. అమరరాజ చైన్ మేనేజ్‌మెంట్ గ్రూప్ సప్‌లై ప్రెసిడెంట్ ఎల్.వెంకటమాధవ్, లాజిస్టిక్ జీఎం ఆర్.చంద్రబాబు, రాజన్న ఫౌండేషన్ హెడ్ రాళ్లపల్లి సతీష్, ఎస్వీ అరవింద్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ శ్రీలత పాల్గొన్నారు.

అనుమతి లేని హోర్డింగుల తొలగింపు

వరదయ్యపాళెం: వరదయ్యపాళెం మేజర్ పంచాయతీలో అనుమతులు లేకుండా రోడ్లకు అడ్డంగా ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లను తొలగించారు. స్థానిక పంచాయతీ ఈఓ బసిరెడ్డి ఆధ్వర్యంలో పంచాయతీ పరిధిలో అక్కడక్కడ వ్యాపార హోర్డింగ్‌లను అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన వాటిని సిబ్బంది ద్వారా తొలగింపజేశారు. ఇకపై ఇలాంటి హోర్డింగులు ఏర్పాటు చేయాలంటే పంచాయతీ అనుమతి ఉండాలని సూచించారు. అది కూడా రోడ్ల పక్కన ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఉన్న ప్రాంతాల్లో తాము సూచించిన ప్రాంతంలోనే వ్యాపార ప్రకటనలతో సిద్ధం చేసిన హోర్డింగులను ఏర్పాటు చేసుకోవాలని ఆయన తెలిపారు. నిబంధనలను అతిక్రమించి హోర్డింగ్‌లను ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


వరదయ్యపాళెం పంచాయతీలో తొలగించిన వ్యాపార హోర్డింగ్‌లు

విస్తారంగా కాకర పంట సాగు


సాగులో ఉన్న కాకర పంట

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని వెస్టువత్తూరు, ఆర్.అనంతాపురం, జీఎన్‌కండ్రిగ, కాంపాళ్లెం, గ్రామాల్లోని రైతులు కాకర పంటను విస్తారంగా సాగు చేస్తున్నారు. 20 ఎకరాల్లో కాకర పంటను రైతులు వేశారు. ఆరుతడి పంట కావడంతో రైతులు మెట్ట భూముల్లో పంటను ఎక్కువ సాగు చేస్తున్నారు. కాకర పంటకు మార్కెట్‌లో ఎక్కువగా డిమాండ్ ఉండడంతో ఎకరాకు అన్ని ఖర్చులు పోను రూ.40 వేలు మిగులుతుంది. దీంతో రైతులు కాకర సాగుపై మక్కువ చూపుతున్నారు. ప్రభుత్వం కాకర పంటకు వాడే మందులను రాయితీపై అందించాలని రైతులు కోరుతున్నారు.

డిగ్రీ ఫలితాల విడుదలకు డిమాండ్

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలో గత ఏడాది డిసెంబర్‌లో నిర్వహించిన డిగ్రీ మొదటి, మూడో సెమిస్టర్ ఫలితాలను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ నేతలు డిమాండ్ చేశారు. శనివారం ఈ మేరకు ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ అప్పారావుకు వినతి పత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ డిగ్రీ రెండు, ఐదు, ఆరో సెమిస్టర్ సైతం పూర్తి అయ్యాయని, అయితే ఇప్పటికీ మొదటి, మూడో సెమిస్టర్ ఫలితాలు విడుదల చేయకపోవడం దారుణమన్నారు. యూజీసీ నిబంధనల మేరకు పరీక్షలు నిర్వహించిన నెల లోపు ఫలితాలను విడుదల చేయాలని వెల్లడించారు. విద్యార్థులు ఉన్నత చదువులు, ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు.

వైభవంగా స్వామివారి ఊంజల్‌సేవ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం పౌర్ణమిని పురస్కరించుకుని ఊంజల్‌సేవ కనుల పండువలా జరిగింది. మొదట ఆలయ అలంకార మండపంలో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. అనంతరం ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. ఊరేగింపుగా ఊంజలసేవ మండపానికి తీసుకొచ్చారు. వేదమంత్రోచ్ఛరణల మధ్య ఊంజల్‌సేవ జరిగింది. వెన్నెలకాంతుల్లో ఊరేగుతున్న స్వామి అమ్మవార్లను భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.



సమష్టిగా కుష్టు నివారణకు కృషి

భాకరాపేట: వైద్య ఆరోగ్య సిబ్బంది సమష్టిగా కుష్టు వ్యాధి నివారణకు కృషిచేయాలని కుష్టు, క్షయ వ్యాధి నిర్మూలన జిల్లా అధికారి డాక్టర్ రాజా కోరారు. శనివారం భాకరాపేట పీహెచ్‌సీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. రాజా మాట్లాడుతూ శరీరంపై స్పర్శలేని మచ్చలు, పొడలు, లావుగా మారి నొప్పితో కూడిన నరాలు, బుడిపెలు, నొప్పిలేని పుండ్లు, చెవి తమ్మెలు మందంగా మారడం, ముఖంపై నూనె రాసినట్లు జిడ్డుగా ఉండడం మొదలైన లక్షణాలుంటే కుష్టు నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కుష్టు రోగులకు ఖరీదైన మందులు, శస్త్రచికిత్సలు ఉచితంగా అందిస్తున్నారని తెలిపారు. ఈనెల 18 నుంచి 15 రోజుల వరకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నామని వెల్లడించారు. సమావేశంలో ఎంఓ అలెగ్జాండర్, డిప్యూటీ డెమో కిరణ్‌కుమార్, సీహెచ్‌ఓ శేషుకుమారి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ రాజా